# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి


I | హైదరాబాద్, శుక్రవారం 12 జూలై 2024 | SANGAREDDY


## బీహార్ కూలీలతో నాట్లు



బైరాన్‌పల్లిలో వరినాట్లు వేస్తున్న బీహార్ కూలీలు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 11: వరి నాట్లకు కూలీల కొరత ఏర్పడుతుండడంతో రైతులు వలస కూలీల మీద ఆధారపడుతున్నారు. వరి నాట్లు వేసేందుకు మూడు, నాలుగేండ్లుగా బీహార్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని సూర్యాపేట, ఖమ్మం తదితర జిల్లాల నుంచి కూలీలు నాట్లు వేసేందుకు వస్తున్నారు. గురువారం సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామానికి బీహార్‌కు చెందిన మగ కూలీలు వందమందికి పైగా వచ్చి నాట్లు వేశారు. ఎకరానికి రూ. 5 వేల నుంచి 6 వేల వరకు తీసుకుంటున్నారు. సాధారణం గా వరినాట్లను ఆడ కూలీలు మాత్రమే వేస్తారు. మగ కూలీలు వరినాట్లు వేస్తుండడంతో గ్రామస్తులు ఆశ్చర్యంగా చూస్తున్నారు.



గురువారం మెదక్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న క్రయ విక్రయదారులు

# పనికో రేటు..!

## చేయి తడపనిదే పనులు కావడం లేదు..!

ఆరుగాలం కష్టించి పంట పండించే రైతును సైతం అవినీతి అధికారులు వదలడం లేదు. గత మే నెలలో నర్సాపూర్ వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ రైతు వద్ద రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సీడ్స్ ధ్రువీకరణ పరిష్మన్ ఇచ్చేందుకు ఏవో లంచం డిమాండ్ చేశాడు. విత్తన కంపెనీలు, సీడ్స్ షాపుల వద్ద వ్యవసాయ శాఖ అధికారులు ప్రతినెలా మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు జోరుగా వినబడుతున్నాయి. ప్రతిపనికి రేటు కడుతూ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

- ఆఫీసుల చుట్టూ నెలల తరబడి తిరగాల్సిందే..
- అన్ని కార్యాలయాల్లో రాజ్యమేలుతున్న దళారులు
- డబ్బులిస్తేనే అవుతున్న పనులు
- ప్రతి పనికీ ఓ రేటు.. ముక్కుపిండి వసూలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- వరుసగా ఏసీబీకి పట్టుపడుతున్న అవినీతి అధికారులు

సిద్దిపేట, జూలై 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి): లంచం..లంచం ఇది లేనిదే ఏ పని కావడం లేదు. అది రెవెన్యూ ఆఫీసు కావచ్చు, పోలీస్‌స్టేషన్ కావచ్చు, మున్సిపాలిటీ కావచ్చు... ఇలా ఒకటేమిటి ఏ శాఖ చూసినా అవినీతితో కంపు కొడుతున్నది. ఏ పనికైనా చేయి తడపనిదే పనికావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలు, 68 మండల పరిషత్‌లు, 3 జిల్లాలు , మున్సిపాలిటీలు 18 ఉన్నాయి. ఒక్కో అఫీసు చుట్టూ నెలల తరబడి తిరిగినా పనులు కావడం లేదని, డబ్బులు ఇస్తే నిమిషాల్లో ఇట్టే పనులు పూర్తి అవుతున్నాయంటున్నారు. పనిని బట్టి రేటు నిర్ణయించి మరి ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అవినీతి నిరోధక అధికారుల (ఏసీబీ) కంట పడకుంగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అధికారుల అవినీతికి అంతు లేకుండా పోయింది. ఎంత అందితే అంత గుంజుతున్నారు. పనికి తగ్గ రేటును నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదేంటి అంటే ఏదో కొర్రీలు పెట్టి పనులు చేయడం లేదు. అధికారితో బేరం కుదరకపోతే పైరవీకారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ప్రతి ఆఫీసులో ఈ మధ్యన పైరవీకారులు ఎక్కువయ్యారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, వ్యవసాయ, మైనింగ్, విద్య, వైద్య తదితర శాఖల్లో ఎక్కువగా అవినీతి జరుగుతున్నట్లు తెలుస్తున్నది. తహసీల్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. ఈ మధ్యకాలంలో బరితెగించి మామూళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. సామాన్యులు తహసీల్ కార్యాలయాలకు వెళ్లాలంటేనే జంకుతున్నారు.దళారులను, పైరవీకారులను కలిసిన తర్వాతే తహసీల్ కార్యాలయాల్లోకి అడుగుపెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పనికో రేటు నిర్ణయించి దళారులు చెప్పిన విధంగా ఇస్తేనే పనులు సాఫీగా జరుగుతున్నాయి. లేదంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. మున్సిపాలిటీల్లో అవినీతి కంపుకొడుతున్నది. టౌన్ ప్లానింగ్ విభాగంలో చేయి తడపనిదే పనులు కావడం లేదు. చేయి తడిపితే త్వరగా పనులు పూర్తి అవుతున్నాయి. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి అధికారి వరకు అంతా ఒక్కటవుతున్నారు. ఎవరి స్థాయిలో వారు దండుకుంటున్నారు. దీంతో ఎవరిపైనా పర్యవేక్షణ లేకుండా పోయింది. ఒక ప్రధాన శాఖలో జిల్లా స్థాయి అధికారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నట్లు సమాచారం. ధిక్కార స్వరంతో కిందిస్థాయి అధికారులు పైస్థాయి అధికారుల పట్ల మాట్లాడుతున్నట్లు ఆ శాఖలోని కొంతమంది ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. వారిపై కఠిన చర్యలు లేకపోవడంతో ఆడింది ఆట పాడింది పాటగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా ఆరు నెలలు పూర్తయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏం జరుగుతుందో పట్టించుకునే వారు కరువయ్యారు. మంత్రులు కనీసం జిల్లా అధికారులతో రివ్యూలు నిర్వహించడం లేదు. దీంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది కాంగ్రెస్ పార్టీ నేతలు పైరవీకారులుగా మారి అవినీతి అధికారులతో అంటకాగి నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయించుకుంటున్నట్లు సమాచారం.

ఇటీవల మెదక్ జిల్లా హవేళీఘనపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్ అవినీతి అధికారులకు దొరకిపోయాడు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను వదిలేందుకు ఎస్సై రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీనికి ఇరువురి మధ్యన రూ. 20 వేలకు బేరం కుదిరింది. టిప్పర్ యజమాని ఎస్సైకి లంచం డబ్బులు ఇస్తుండగా అవినీతి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గతంలో సైతం మెదక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇసుక ట్రాక్టర్లు విడుదల చేసేందుకు కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ అవినీతి అధికారులకు దొరికాడు.




ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన మెదక్ జిల్లా హవేళీఘనపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్

# స్తంభించిన రిజిస్ట్రేషన్లు

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వర్ డౌన్
- పడిగాపులు కాసిన క్రయవిక్రయదారులు

మెదక్, జూలై 11 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం రిజిస్ట్రేషన్లు స్తంభించిపోయాయి. సర్వర్ పనిచేయకపోవడంతో లావాదేవీలను ఆపేశారు. రెండు రోజులుగా నామమాత్రంగానే రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో కోట్లాది రూపాయల లావాదేవీలు నిలిచిపోయాయి. మెదక్ జిల్లాలో నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో మెదక్, తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతిరోజూ 10 నుంచి 20 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. సాంకేతిక లోపం తలెత్తడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీంతో ఉద యం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల దగ్గర జనం పడిగాపులు కాశారు. సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దాదా పు జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆధార్ వెరిఫికేషన్ ఆగిపోవడంతో 10 నుంచి 20 డాక్యుమెంట్లు ఆగిపోయా యి. ఉద్యోగాలకు, ఇతర పనులను వదిలిపెట్టి మరి ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కోసం వేచి చూస్తున్నామని క్రయ విక్రయదారులు చెప్పారు.



పాత్రలోని కూరను పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు



పప్పును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరీరాణి

## జేఎన్‌టీయూలో అధికారుల వరుస తనిఖీలు

చౌటకూర్, జూలై 11: మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను అధికారులు వరుసగా తనిఖీ చేస్తున్నారు. ఫలితంగా కళాశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా అడుగులు పడుతున్నాయి. దీంట్లో భాగంగానే బుధ, గురువారాల్లో అందోలు–జోగిపేట ఆర్డీవో పాండు, స్థానిక తహసీల్దార్ ఈశ్వరీరాణి వేర్వేరుగా ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినీ విద్యార్థుల వసతి గృహాలకు వెళ్లి వండిన టిఫిన్ చట్నీ, అన్నం, కూరలను పరిశీలించారు. వంట గదులను పరిశీలించారు. రెండు రోజుల క్రితం టిఫిన్ చట్నీ పాత్రలో చిట్టెలుక పడడంతో విద్యార్థులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.జిల్లా మంత్రి దామోదర రాజనరసింహ, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్డీవో పాండు, తహసీల్దార్ ఈశ్వరీరాణి వరుస తనిఖీలు చేస్తున్నారు. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న దాదాపు 1400 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వసతి గృహంలో వంటలు వండి ఆహారాన్ని అందజేస్తున్నారు. ఇక్కడి నుంచే బాలుర వసతి గృహానికి ఆహారాన్ని సరఫరా చేస్తున్నారు. అధికారుల వరుస తనిఖీలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేస్తూ, వంట గదులు శుభ్రంగా ఉంచుతున్నారు. కళాశాలలో మెస్‌ల నిర్వహణకు త్వరలో టెండర్లు పిలుస్తామని ప్రిన్సిపాల్ నరసింహ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

## చెత్త కనిపిస్తే చర్యలు

- అధికారులు ప్రతిరోజూ ఉదయం వార్డుల్లో పర్యటించాలి
- వీధికుక్కలను నియంత్రించాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశం

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 11: జిల్లాకేంద్రం సంగారెడ్డిలో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ వల్లూరు క్రాంతి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, పశు సంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణంలోని బైపాస్ రోడ్డు, ప్రధాన కూడళ్లు, చర్చి సమీపంలో, వార్డుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని, మున్సిపల్ కమిషనర్ ఉదయం వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించాలని, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందని, రెండోసారి బాలుడిని కుక్క దాడిచేయడంపై కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చవాన్, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వహణ లోపం..క్రీడాకారులకు శాపం

- నిరుపయోగంగా మారుతున్న జయశంకర్ స్టేడియం
- క్రికెట్ అసోసియేషన్, క్రీడల యువజన సర్వీసుల శాఖ మధ్య సమన్వయ లోపం
- నష్టపోతున్న క్రీడాకారులు



సిద్దిపేటలో నిర్వహణ లోపంతో గడ్డి పెరిగి ఆడేందుకు వీల్లేకుండా తయారైన పిచ్

సిద్దిపేట, జూలై 11: క్రీడా ప్రాంగణాల నిర్వహణ లోపం క్రీడాకారులకు శాపంగా మారుతున్నది. గ్రామీణ క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయి సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు అసోసియేషన్, అధికారుల మధ్య సమన్వయలేమి కారణంగా క్రీడాకారులకు అందుబాటులో లేకుండాపోతున్నాయి. మొన్నటి వరకు అంతర్ జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన సిద్దిపేటలోని ఆచార్య జయశంకర్ క్రికెట్ మైదానం నేడు నిర్వహణ లేమి కారణంగా క్రీడాకారులకు పనికి రాకుండా పోయింది. ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సిద్దిపేటలో అన్ని సౌకర్యాలతో ఆచార్య జయశంకర్ స్టేడియం నిర్మించారు. నిన్న మొన్నటి వరకు నిత్యం క్రీడాపోటీలు, డేఅండ్‌నైట్ మ్యాచ్‌లు జరిగిన ఈ స్టేడియం నేడు ఖాళీగా దర్శనమిస్తున్నది. మైదాన నిర్వహణ బాధ్యతలను జిల్లా క్రీడల యువజన సర్వీసుల శాఖ, క్రికెట్ అసోసియేషన్ నిర్వహించేది. అధికారులు, అసోసియేషన్ మధ్య సమన్వయం లేకపోవడంతో స్టేడియం నిర్వహణ గాలికి వదిలేశారు. సిద్దిపేట స్టేడియం టర్ఫ్ టికెట్ కావడంతో దాని నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బంది ఉన్నారు. ఏమైందో ఏమో కానీ రెండు నెలల నుంచి స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి లేకుండా పోయింది. టర్ఫ్ పిచ్ కావడంతో దానిని నిత్యం రోలింగ్ చేయడంతో పాటు వర్షం వచ్చినప్పుడు ఆరబెడుతూ ఉండాలి. దీనికి తోడు గ్రాస్ కటింగ్ పనులు ఎప్పటికప్పుడు చేస్తుండాలి. పిచ్ రోల్ చేసేందుకు రోలింగ్ కేంద్రాలు ఉన్నప్పటికీ, పాడైపోవడంతో వాటికి మరమ్మతులు చేయడం లేదు. ఈ పనులన్నీ జరగని కారణంగా స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించడం లేదు. పిచ్‌పై గ్రాస్ పెరగడంతో మ్యాచ్‌లు ఆడడం క్రీడాకారులకు ఇబ్బందిగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు పిచ్‌ను పునరుద్ధరించి క్రికెట్ మ్యాచ్‌లు జరిగేలా చూడాలని క్రీడాకారులు కోరుతున్నారు.

### మ్యాచ్‌లు జరగడం లేదు..



మా పిల్లలు ఇక్కడే క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నారు. నిత్యం నేను వారిని స్టేడియానికి తీసుకువస్తాను. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులకు ప్రతి ఆదివారం మ్యాచ్ నిర్వహించేవారు. కానీ, పిచ్ సిద్ధంగా లేకపోవడంతో మ్యాచ్‌లు ఆడించడం లేదు. అధికారులు స్పందించి మైదానాన్ని సిద్ధం చేయాలి. –ఎస్.శ్రీనివాస్, మిట్టపల్లి

### పిచ్ సరిగ్గా లేదు..



మా అబ్బాయిని నిత్యం కోచింగ్ కోసం ఈ స్టేడియానికి తీసుకువస్తున్న.శిక్షణ పొందిన క్రీడాకారులకు పిచ్‌పై ఆడడం ద్వారా మంచి మెలకువలను నేర్చుకునేందుకు వీలు ఏర్పడుతుంది. అనుభవం వస్తుంది. పిచ్ నిర్వహణ సరిగా లేకపోవడంతో పిల్లలు మ్యాచ్‌లు ఆడేందుకు ఇబ్బందిగా మారింది. – మల్లారెడ్డి, సిద్దిపేట

### అందుబాటులోకి తెస్తాం



క్రికెట్ స్టేడియంలో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇన్ని రోజులుగా క్రికెట్ అసోసియేషన్, క్రీడలు యువజన సర్వీసుల శాఖ తరఫున స్టేడియం నిర్వహణ చూశాం. సిబ్బందికి మా శాఖ తరఫునే వేతనాలు ఇస్తున్నాం. కోచింగ్‌కు వచ్చే పిల్లల వద్ద ఫీజులు కలెక్ట్ చేసి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నాం. –నాగేందర్, డీవైఎస్‌వో

### స్టేడియం అప్పగించాం



రెండు నెలల కిందటే క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారికి స్టేడియం బాధ్యతలు అప్పగించాం. ఎనిమిదేండ్ల పాటు స్టేడియం నిర్వహణ బాధ్యతలను అసోసియేషన్ తరఫున చూశాం. స్టేడియంలో ఉన్న రోలింగ్ యంత్రాలు, క్రీడా పరికరాలన్నీ అసోసియేషన్ సంబంధించినవే. –మల్లికార్జున్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సిద్దిపేట

### జనాభా నియంత్రణ

## ప్రతిఒక్కరి బాధ్యత

**సిద్దిపేట జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్**



మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేట, జులై 11: జనాభా నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత.. జనాభా పెరగడం వలన అనేక నష్టాలు కలుగుతాయని సిద్దిపేట జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం జనాభా దినోత్సవంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ లక్కీ డీప్ ద్వారా ఎంపికైన ముగ్గురు అర్హులైన దంపతులకు రూ.వెయ్యి నగదు బహుమతులను అందజేశారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన ఐదుగురు అధికారులు గజ్వేల్ జిల్లా దవఖానకు చెందిన డాక్టర్ అన్నపూర్ణ, నర్సింగ్ ఆఫీసర్ సునీతాకుమార్, కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఎంపీహెచ్ఎస్ సుభద్ర, వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఎంపీహెచ్ఎస్ శ్రీలత, రామక్కపేట పీహెచ్‌సీకి చెందిన ఆశ వర్కర్ దేవలక్ష్మి, జిల్లా దవాఖాన గజ్వేల్‌కు చెందిన ఎంఎన్‌వోకే మురళిలకు ప్రశంసాపత్రాలతోపాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్లు రజిని, శ్రీదేవి, విజయరాణి, శ్రీకాంత్, ఏవో రవీందర్‌రెడ్డి, సీసీ డానియల్, సిబ్బంది పాల్గొన్నారు.

### పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ర్యాలీలు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దూరు, లద్నూర్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య అధికారులు సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జనాభా నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. డాక్టర్ స్టువర్ట్ సన్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాలిక ఆత్మహత్య

న్యాల్‌కల్, జూలై 11: పెండ్లి విషయంలో మనస్తాపానికి గురై మండలంలోని రేజింతల్‌లో గురువారం బాలిక ఆత్మహత్య చేసుకుందని హద్నూర్ పోలీసులు తెలిపారు.గ్రామానికి చెందిన బర్ధీపూర్ శ్వేత(16)అదే గ్రామానికి చెందిన నట్కారీ రమేశ్‌తో ప్రేమలో ఉంది. ఈ విషయంలో గతంలో యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఇటీవల పెద్దల సమక్షంలో బాలికను పెండ్లి చేసుకోవాలని యువకుడిపై ఒత్తిడి తీసుకురావడంతో ఒప్పుకున్నాడు. బాలిక మైనర్‌కావడంతో 18 ఏండ్లు నిండిన తర్వాత పెండ్లి చేసుకుంటానని, అప్పటివరకు చదివించాలని కుటుంబసభ్యులను యువకుడు కోరాడు. ఇటీవల హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన బాలిక రమేశ్‌తో పెండ్లి జరుగుతదో, లేదోనని మనస్తాపంతో ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలితల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

## డ్రగ్స్ మాట వినపడొద్దు

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట కలెక్టరేట్, జూలై11: సిద్దిపేట జిల్లాలో గంజాయి, ఇతరత్రా నార్కోటిక్ మత్తు పదార్థాలను పూర్తిగా అంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా స్థాయి నార్కో–కోఆర్డినేషన్ సెంటర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల బారిన ప్రజలు పడకుండా వాడడం, రవాణా, క్రయ విక్రయాలను నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డ్రగ్స్ నివారణ విషయం మీద వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. తరగతుల వారీగా యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. బడికి రాని, బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించి డ్రగ్స్ బారిన పడకుండా పిల్లలకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని డీఈవోకు సూచించారు. వ్యవసాయ క్షేత్రాల్లో గంజాయి పెంచకుండా రైతులకు చెప్పాలన్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో మత్తు చాక్లెట్లు, ఇతరత్రా పదార్థాల రూపంలో డ్రగ్స్ విక్రయాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్‌కు 14446, 8712671111 సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల అక్రమ అరెస్ట్ దారుణం

**మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి**

మెదక్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఉస్మానియా యూనివర్సిటీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థుల న్యూస్ కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడాన్ని ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఉస్మానియా వర్సిటీలో జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడం చాలా దారుణమన్నారు. కచ్చితంగా జర్నలిస్టులు వార్తలు కవరేజ్‌కి వెళ్లడం నేరమా, డీఎస్సీ సమస్యపై నిరుద్యోగుల నిరసన చేస్తే పాపమా అని ప్రశ్నించారు. విద్యార్థులపై, జర్నలిస్ట్‌లపై దాడి చేసిన పోలీసులపై తక్షణమే ప్రభుత్వపరంగా తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

# పాండురంగడి ఆషాఢ ఉత్సవాలు

- సిద్ధమైన మర్కూక్ పాండురంగాశ్రమం
- రేపటి నుంచి 18వరకు ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తజనం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆశ్రమ కమిటీ



పాండురంగ స్వామి ఆలయం

మర్కూక్, జూలై 11 : తెలంగాణ పండరీపురంగా ప్రసిద్ధిగాంచిన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని పాండురంగస్వామి దేవాలయం ఆషాఢ ఉత్సవాలకు సిద్ధమైంది. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి ప్రతిరూపమే పాండురంగడుగా భక్తుల చేత కీర్తించబడిన ప్రాంతంగా మర్కూక్ పాండురంగాశ్రమం పేరుపొందింది. ఏటా ఆషాఢ శుద్ధ ఏకాదశి, ద్వాదశితో పాటు వరుసగా మూడురోజుల పాటు ఇక్కడ ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తారు. దశమి రోజు అశేష భక్తజనం సమక్షంలో అఖండ హరి నామ స్మరణ ప్రారంభించి ద్వాదశి వరకు మూడురోజుల పాటు నామసంకీర్తనలు కొనసాగుతాయి. ఏకాదశి రోజు భక్తులంతా ఉపవాసం ఉండి జాగారం చేస్తారు. ఈనెల 13 నుంచి 18 వరకు ప్రత్యేక పూజలు, ధార్మిక ప్రసంగాలు, సంగీత, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వసతులు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

**మహా అన్నదానం..**

భవానందస్వామి స్వహస్తాల చేత 1992లో ఆషాఢ ఉత్సవాల్లో మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.కులమతాలకు అతీతంగా అన్నదానం చేస్తారు. ఆలయ నిర్వాహకులు ముందురోజున సాయంత్రం వివిధ రకాలైన వంటలను వండి అన్నాన్ని పెద్దరాశిగా ఆరబోసి అన్నపూజ నిర్వహించి చాటల ద్వారా భక్తులకు వడ్డిస్తారు. చాటల ద్వారా అన్నం వడ్డించడం దేశంలోనే మరెక్కడ లేని సాంప్రదాయం మర్కూక్ పాండురంగాశ్రమంలోనే ఉంది. చాటలతో వడ్డించే అన్నప్రసాదం స్వీకరణ కోసం అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.